సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



చెరువుకు మరమ్మతులు కరువు

కుర్రారం పెద్దచెరువు అలుగుకు ఏడాది క్రితం గండిపడినా ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టడం లేదు. - 9లో



మూడేళ్లలో మూడు లక్షలు

బీబీనగర్ ఎయిమ్స్‌లో రోజూ వెయ్యి మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వస్తున్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం

38° / 25°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36 (మంగళవారం సాయంత్రం)

సహర్ 4-39 (బుధవారం ఉదయం)

న్యూస్‌రీల్

హ్యాండ్లూమ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరిటౌన్ : ఒడిశాలోని బర్గర్‌లో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థలో హ్యాండ్లూమ్ అండ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 సీట్లు ఉండగా తెలంగాణకు తొమ్మిది సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జూన్ 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నంబర్ 9437367550లో సంప్రదించాలన్నారు.

పదో తరగతి పరీక్షకు 8,969 మంది హాజరు



రామన్నపేటలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి బయటకు వస్తున్న అదనపు కలెక్టర్

భువనగిరి, రామన్నపేట : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన జనరల్ సైన్స్‌కు 8,987 మంది విద్యార్థులకు గాను 8,969 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరైనట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. పలు చోట్ల పరీక్ష కేంద్రాలను డీఈఓ, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తనిఖీ చేశారు. అదే విధంగా రామన్నపేటలోని పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించారు. హాజరైన విద్యార్థుల శాతాన్ని తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీడీ నాగిరెడ్డి, ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, సీఎస్‌లు సత్యనారాయణరాజు, సురేష్‌రెడ్డి , జ్యోతి ఉన్నారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామారావు



యాదగిరిగుట్ట: తెలంగాణ ఉద్యోగుల సంఘం సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి పుణ్యక్షేత్రంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఊడెపు రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రవీందర్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రా మారావు మాట్లాడుతూ సంఘం బలోపే తానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

యాదాద్రి శివాలయంలో విశేష పూజలు



స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మండపంలో నిత్య రుద్రహవనం, మహాశివుడికి అభిషేకం, అర్చనలు గావించారు. ఇక శివ గర్భాలయంలో, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడి సన్నిధిలో నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేరుగా సాగు నీరు!

కాల్వలు తవ్వకుండా పైపులైన్ల ద్వారా సరఫరా

- రోడ్లు, పొలాలకు వెళ్లే బాటల వెంట పైపులైన్లు
- ఉద్యాన పంటలకు మాత్రమే నీళ్లు
- జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు
- పైలట్ ప్రాజెక్టుగా బీబీనగర్, బొమ్మలరామారం మండలాలు
- భూ సేకరణ, నీటి వృథా ఉండదు
- కొండపోచమ్మసాగర్ కెనాల్ నుంచి గోదావరి జలాల తరలింపు



బొమ్మలరామారం వద్ద పొలాల వద్దకు వెళ్లే దారి పక్కనుంచి పైపులైన్ వేయడానికి తీసిన గొతు

సాక్షి, యాదాద్రి : రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలకు నేరుగా నీరందనుంది. కాల్వలు తవ్వే పని లేకుండా పైప్‌లైన్ ద్వారా సాగు నీరు సరఫరా కానుంది. రోడ్ల వెంట, అక్కడి నుంచి పొలాలకు వెళ్లే బాటల వెంట మాత్రమే పైపులైన్లు వేసి నీటిని తరలించనున్నారు. మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి, యాదాద్రి జిల్లాలోని బీబీనగర్, బొమ్మలరామారం మండలాల్లో ప్రయోగాత్మకంగా నూతన విధానానికి శ్రీకారం చుట్టింది నీటిపారుదల శాఖ. కొండపోచమ్మసాగర్ నుంచి గోదావరి జలాలు తరలించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులను ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ పనుల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేయనున్నారు.

గుజరాత్ తరహాలో..

భూ సేకరణ లేకుండా, నీటి వృథా కాకుండా పైపులైన్ల ద్వారా ఉద్యాన పంటలకు నీరిందించే గుజరాత్ తరహా విధానాన్ని జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు. సాధారణంగా పొలాలకు సాగు నీరు అందించాలంటే మెయిన్ కెనాల్, బ్రాంచ్ కెనాల్, మేజర్ కెనాల్, మైనర్ కెనాల్, సబ్‌మైనర్ కెనాల్, ఫీడర్ చానల్.. ఇలా వివిధ రకాల కాల్వలు తవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం రైతుల నుంచి భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. అయితే భూముల ధరలు విపరీతంగా పెరగడం, ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి రైతులు అంగీకరించకపోవడంతో చాల చోట్ల భూసేకరణ సమస్యగా మారింది. దీంతో ప్రాజెక్టుల పనులు నిలిచిపోతున్నాయి. సమస్యను అధిగమించేందుకు నూతన విధానం అమలు చేస్తున్నారు. రహదారుల వెంట ఖాళీ స్థలంలో పెద్ద పైపులు వేసి అక్కడి నుంచి పొలాలకు వెళ్లే బాటల వెంట చిన్న పైపులు ఏర్పాటు చేసి నీరందిస్తారు. ఏడాదిలోగా పనులు పూర్తి కావల్సి ఉంది.

కొండపోచమ్మసాగర్ జలాల తరలింపు

సిద్దిపేట జిల్లా కొండపోచమ్మసాగర్‌నుంచి సంగారెడ్డి కెనాల్ ద్వారా రామాయంపేట, రాహుల్ కోల్ కెనాల్ ద్వారా ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు వెళ్తున్నాయి. రాహుల్‌కోల్ కెనాల్ నుంచి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట చెరువు నింపనున్నారు. అక్కడి నుంచి యాదాద్రి జిల్లాలో బీబీనగర్, బొమ్మలరామారం మేడ్చల్ జిల్లాలోని మల్కాజ్‌గిరి ప్రాంతాలకు పైపులైన్‌ద్వారా సాగు నీరు అందజేయాలని అధికారులు నిర్ణయించారు. రహదారుల వెంట మాత్రమే కాల్వలు తవ్వి వాటిలో పైపులు వేసి నీరు సరఫరా చేయనున్నారు. రైతుల నుంచి భూములు సేకరించాల్సిన అవసరం లేకపోవడంతోపాటు నీరు వృథా కాకుండా అరికట్టవచ్చన్న ఉద్దేశంతో ఈ విధానానికి శ్రీకారం చుట్టారు.

జిల్లాలో 18వేల ఎకరాలకు నీళ్లు

హైదరాబాద్ శివారులో ఉన్న బొమ్మల రామారం, బీబీనగర్ మండలాల్లో కూరగాయలు, పండ్లు, పూల తోటలు అధికంగా సాగవుతున్నాయి. సరైన నీటి వనరులు లేకపోవడంతో ఇటీవల ఆయా పంటల సాగు విస్తీర్ణం తగ్గుతోంది. హైదరాబాద్ ప్రజల భవిష్యత్ అవసరాలు తీర్చడానికి మరింతగా సాగు విస్తీర్ణం పెరగాల్సిన అవసరాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. రెండు జిల్లాల్లో 28 వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లాలో 18 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీటన్నింటికీ పైపులైన్ల ద్వారా సాగు నీరు అందించడానికి గుజరాత్ తరహాలో నూతన ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా చేపట్టారు. మన జిల్లాలో రూ.120 కోట్లు ఖర్చు చేయనున్నారు.

మొదలైన పనులు

పైపులైన్ పనులను కలెక్టర్ పమేలా సత్పతి ఇటీవల నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ హరీరాంతో కలిసి ప్రారంభించారు. ప్రధాన పైపులైన్ బొమ్మలరామారం వరకు 64.303 కిలో మీటర్ల మేర వేస్తారు. దీనిద్వారా జిల్లాలోని తూంకుంట, జలాల్‌పూర్, యావాపూర్, రామలింగంపల్లి, కాజీపేట, బొమ్మలరామారం, రంగాపూర్, మర్యాల, హాజీపూర్, మైసిరెడ్డిపల్లి, మైలారం, బీబీనగర్ మండలం గూడూరు, జైనపల్లి గ్రామాలకు నీరందనుంది. ఇక మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి కీసర ప్రధాన పైపులైన్ 34.671 కిలో మీటర్ల పొడవునా బీబీనగర్ మండలం రాయరావుపేట, జమీలాపేట, జియాపల్లి, మహాదేవ్‌పూర్, కొండమడుగు వరకు రానుంది. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి అనుమతి పొంది పనులు నిర్వహిస్తున్నారు. అవసరాన్ని బట్టి ఒక మీటర్, 1.5, 1.2, 7 మీటర్ల సైజున్న పైపులు వాడుతారు.



బొమ్మలరామారం మండలంలో పైపులైన్ పనులకు భూమి పూజ చేస్తున్న కలెక్టర్

వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

- రిటైర్డ్ ఉద్యోగుల నిరసన దీక్ష

భువనగిరిటౌన్ : రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రతి జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాట్యుటీ, కరువు భత్యం చెల్లించాలని, హెల్త్‌కార్డుల ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం సదుపాయం కల్పించాలని కోరారు. ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రేకల ఆనందం, యూనిట్ అధ్యక్షుడు తాదూరి కిష్టయ్య, నాయకులు మల్లయ్య, అంజనేయులు, శంకరయ్య, లక్ష్మారెడ్డి, యాదిరెడ్డి, సత్తయ్య, రాంరెడ్డి, శంకరయ్య, పి.సోమన్న పాల్గొన్నారు.

ప్రజావాణికి 30 వినతులు

- అత్యధికంగా రెవెన్యూ సమస్యలపైనే



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రాలు అందజేశారు. అర్జీలను పరిశీలించిన కలెక్టర్.. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపించారు. ప్రజావాణికి సుదూర ప్రాంతాల నుంచి బాధితులు వస్తుంటారని, వారు ఇచ్చిన అర్జీలను జాప్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 30 వినతులు రాగా రెవెన్యూ సమస్యలపైనే 26 ఉన్నాయి. పంచాయతీరాజ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, దేవాదాయ, విద్యాశాఖలకు సంబంధించి ఒక్కో దరఖాస్తు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, అధికారులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి : ఆలేరు పట్టణ పరిధిలో అన్ని అర్హతలు కలిగి డబుల్ బెడ్ రూం ఇళ్లు రాని నిరుపేదలకు స్థలం కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆలేరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏళ్లతరబడి కిరాయి ఇళ్లలో ఉంటున్నారని, ప్రభుత్వ స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేశం, గొట్టిపాముల శ్రీనివాసరాజు, దర్శిబొడ్డు అంజనేయులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం



కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పిఆహ్వానిస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జిబ్లక్‌పల్లి, దంతూర్, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పార్టీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ విఫలమైందని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, రైతు రుణమాఫీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. ఇలా ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. మూసీ సాగునీటి కాల్వలు, బ్రిడ్జి నిర్మాణాలు, వంకమామిడి - శేరిల్లా రోడ్డు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్, బీజేపీలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. ఈ సందర్భంగా దంతూరుకు చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు గోరుకంటి రవీందర్, వార్డు సభ్యుడు మన్నె సత్తిరెడ్డితో ఆయా గ్రామాల్లో సుమారు వంద మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సన్మానించారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడి భగ్నం

భువనగిరిటౌన్ : టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న పత్రం లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం యూత్ కాంగ్రెస్ నాయకులు తలపెట్టిన ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌కు వెళ్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను మధ్యలోనే పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల నుంచి తప్పించుకుని క్యాంపు కార్యాలయం ముట్టడికి వస్తున్న యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రదీప్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు కొల్లూరి రాజును పోలీసులు వెబడించి రహదారి బంగ్లాల వద్ద అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బర్రె నరేష్ మాట్లాడుతూ.. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైనదన్నారు. ఈ కార్యక్రమంలో దర్గాయి దేవేందర్, వెంకన్న, శ్రీలత, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో యూత్ కాంగ్రెస్ నాయకులు

బడిబాటకు ఏర్పాట్లు చేయండి

- సన్నాహక సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అధికారులు

సాక్షి,యాదాద్రి : 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి బడిబాట కార్యక్రమం నిర్వహించేందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో బడిబాట సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూన్ మొదటి వారంలో బడిబాట నిర్వహించాలని, బడి బయట ఉన్న చిన్నారులంతా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన వారిని 6లో, 7, 8 తరగతులు పూర్తి చేసిన వారిని హైస్కూల్‌లో చేర్పించాలని సూచించారు. డ్రాపౌట్‌లకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. బాలికా విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అవసరమైతే పాఠశాల యాజమాన్య కమిటీల సహాయంతో ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీ, ఐసీడీఎస్ సిబ్బంది కూడా సహకరించాలని కోరారు. గ్రామసభలు ఏర్పాటు చేసి మన ఊరు – మన బడి కార్యక్రమం కింద చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు విద్యాబోధన, అభ్యసన సామర్థ్యాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారి పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను నిర్వహించాలని సూచించారు. సామాజిక బాధ్యతగా ప్రతి నెలా తల్లిదండ్రుల మీటింగ్, నెలకు రెండు సార్లు స్వయం సహాయక మహిళా సమాఖ్యలతో సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. వంద శాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా చూడాలని, హాజరుశాతంపైనా దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని, ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ మందడి ఉపేందర్‌రెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, డీపీఓ సునంద, బీసీ సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ, ఎస్సీ అభివృద్ధి శాఖల అధికారులు యాదయ్య, కృష్ణవేణి, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ పెరుగుతున్న కరోనా

- ఇటీవల కాలంలో 62 మందికి పాజిటివ్ లక్షణాలు
- సోమవారం ఒక్క రోజే ఐదు కేసులు
- మాస్క్ ధరించాలని వైద్యాధికారుల హెచ్చరిక

టీకా పంపిణీ

మొదటి టీకా వేసుకున్న వారు	5,57,643
రెండో టీకా	5,64,692
బూస్టర్ డోసు	2,76,107

భువనగిరి : కరోనా వైరస్ మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ హెచ్చరికల మేరకు జిల్లా వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. పలు ఆస్పత్రుల్లో కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రోజూ 10నుంచి 15 మంది, బీబీనగర్ ఎయిమ్స్‌లో 30నుంచి 50 మంది కోవిడ్ టెస్టుల కోసం వస్తున్నారు. ఇటీవల సుమారు 416 మందికి టెస్టులు చేయగా 62 మందికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు తేలింది. సోమవారం ఒక్క రోజే ఐదు కేసులు నమోదయ్యాయి. మార్చి నుంచి కేసులు పెరుగుతూ వస్తున్నాయి.

టీకా, బూస్టర్ డోసుకు నిరీక్షణ

జిల్లాలో బూస్టర్ డోస్ కోసం నిరీక్షణ తప్పడం లేదు. 2020 మార్చి నెలాఖరులో కోవిడ్ కేసులు మొదలయ్యాయి. మొదటి విడత కన్న రెండో విడుతలో వేలాది మంది కరోనా బారినపడ్డారు. ఈ సమయంలో టీకా అందుబాటులోకి తెచ్చారు. తర్వాత వైరస్ వ్యాప్తి తగ్గడంతో ప్రజలు టీకా పట్ల ఆసక్తి చూపలేదు.తాజాగా కోవిడ్ కేసులు నమోదు అవుతుండడంతో బూస్టర్ డోస్ తప్పనిసరిగా తీసుకోవాలని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నాయి. కానీ టీకా, బూస్టర్ డోసులు అందుబాటులో లేవు. కేసులు పెరుగుతుండడంతో జనం టీకా, బూస్టర్ డోస్ కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగిపోతున్నారు.



టీకా వేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

ప్రభుత్వానికి నివేదిక పంపాం

టీకా, బూస్టర్ డోసుల గురించి ప్రభుత్వానికి నివేదికను పంపాం. ఇంకా రాలేదు. ప్రస్తుతం కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటుబీబీనగర్ ఎయిమ్స్,కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఐసోలేషన్ కేంద్రాలు ఉన్నాయి. పాజిటివ్ కేసులు పెరుగుతున్నందున తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. భౌతికదూరం పాటించాలి. లక్షణాలు న్నట్లు అనుమానం వస్తే టెస్ట్ చేయించుకోవాలి.

–డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీఎంహెచ్‌ఓ

ఆటాడుకుందాం..

చౌటుప్పల్‌కు ఔట్‌డోర్ స్టేడియం మంజూరు

- రూ.2.60 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- సర్కారు స్థలాలను గుర్తించే పనిలో అధికారులు



లక్కారంలోని 50 సర్వే నంబర్‌లో ప్రభుత్వ స్థలం

చౌటుప్పల్ : క్రీడాకారులు, క్రీడాభిమానుల కల త్వరలో సాకారం కానుంది. చౌటుప్పల్ పట్టణంలో స్టేడియం లేక ఎంతోమంది క్రీడలకు దూరం అవుతున్నారు. స్టేడియం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఔట్ డోర్ స్టేడియం మంజూరు చేసింది. నిర్మాణానికి రూ.2.60కోట్లు కేటాయించింది.

ప్రభుత్వ స్థలం కోసం అన్వేషణ

ఔట్‌డోర్ స్టేడియం ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రభుత్వ స్థలం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు అన్వేషిస్తున్నారు. అన్ని హంగులతో స్టేడియాన్ని నిర్మించాల్సి ఉన్నందున ఐదు ఎకరాల వరకు స్థలం ఉండేలా చూస్తున్నారు. ఐదు ఎకరాలు కుదరకపోతే కనీసం మూడు కరాల వరకు సేకరించనున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల భూములను గుర్తించి ఆ స్థలాలపై అంతర్గతంగా అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

కేటాయించిన నిధులు ఇలా..

స్టేడియం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.60 కోట్ల కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నిధులతో వివిధ నిర్మాణాలతో పాటు ఆట స్థలాన్ని చదును చేయడం, పచ్చికబయళ్లు వేయడం వంటి పనులు చేపట్టనున్నారు. కేటాయించిన నిధులు సరిపడని పక్షంలో మరికొన్ని సమకూర్చే అవకాశాలు ఉన్నాయి.

క్రీడాకారుల్లో ఆనందం

ఈ ప్రాంతంలో క్రీడాకారులకు కొదవలేదు. క్రికెట్‌తో పాటు వివిధ రకాల ఆటల్లో ప్రావీణ్యులు ఉన్నారు. కానీ, స్టేడియాలు లేకపోవడం ఖాళీ స్థలాలను, వ్యవసాయ భూముల్లో ఆడుకోవాల్సి వస్తుంది. క్రికెట్ తదితర టోర్నమెంట్‌లను మాత్రం తంగడపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన స్టేడియంలో నిర్వహిస్తున్నారు. ఇది అన్ని రోజుల్లో సాధ్యం కావడంలేదు. ఔట్ డోర్ స్టేడియం మంజూరైనందున క్రీడాకారులకు త్వరలోనే ఆ సమస్య తీరనుంది. అన్నీ సవ్యంగా సాగితే ఏడాదిలోగా స్టేడియం అందుబాటులోకి రానుంది. స్టేడియం మంజూరు కావడంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్టేడియం మంజూరు హర్షణీయం



దినదినాభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో క్రీడల కోసం స్టేడియాలు చాలా అవసరం. ఔట్‌డోర్ స్టేడియం కోసం ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం స్టేడియం మంజూరు చేయడం హర్షణీయం. లక్కారం పరిధిలోని 50 సర్వే నంబర్‌లో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంది. ఇక్కడైతే అన్ని విధాల సౌకర్యంగా ఉంటుంది.

–ఎండీ బాబాషరీఫ్, కౌన్సిలర్, చౌటుప్పల్

స్థలాన్ని గుర్తించే పనిలో ఉన్నాం



నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా చౌటుప్పల్‌కు అవుట్‌డోర్ స్టేడియం మంజూరైంది. స్టేడియం నిర్మాణానికి 3 నుంచి 5 ఎకరాల స్థలం అవసరం ఉంటుంది. చౌటుప్పల్ పట్టణంలో స్థలం కోసం అన్వేషిస్తున్నాం. దీంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో భూములను గుర్తించాం. అనువైన స్థలాన్ని ఎంపిక చేయాల్సి ఉంది. త్వరలో క్రీడాకారుల కష్టాలు తొలగిపోతాయి.

–కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

లారీ, బైక్ ఢీ.. బాలుడికి గాయాలు


గాయపడిన మణికంఠ

మోత్కూరు : బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడు గాయపడ్డాడు. ఈ ఘటన మోత్కూరు మండలం పాటిమట్ల ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. అనాజిపురం నుంచి అతి వేగంగా వస్తున్న లారీ పాటిమట్ల ఎక్స్ రోడ్డు వద్ద దాచారం గ్రామానికి చెందిన సాదుల రాములు కుమారుడు మణికంఠ బైక్‌పై వస్తుండగా ఢీకొట్టింది. బాలుడికి తీవ్ర గాయాలు కాగా బైక్ నుజ్జు నుజ్జయ్యింది. బాలుడి 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


భాస్కర్ మృతదేహం

భువనగిరి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని హన్మాపురం గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మలరామారం మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మల భాస్కర్ (35) సోమవారం రాత్రి 7 గంటల సమయంలో భువనగిరి నుంచి స్వగ్రామానికి బైకుపై వెళ్తున్నాడు.ఇదే సమయంలో తుర్కపల్లి నుంచి భువనగిరి వైపు అతివేగంగా వస్తున్న టిప్పర్ హన్మాపురం గ్రామ సమీపంలో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైకుపై వెళ్తున్న భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సైదులు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ శ్రీమతి పుర్మ రజని భర్త: కుప్పిరాల దిలిప్ చక్రవర్తి, రిప్రజెంటెడ్ బై శ్రీ పుర్మ నర్సింహ్మారెడ్డి తండ్రి: మల్లారెడ్డి, నివాసం: ఇ.నెం.3-2- 87/4ఎ, ఏ.ఎం.ఆర్.నగర్, భువనగిరి టౌన్, యాదాద్రి భువనగిరి జిల్లా వారు క్రిస్టల్ టౌన్ షిప్ ప్రీమియమ్, హన్సానాబాద్ రెవెన్యూ విలేజ్, భువనగిరి మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాలో గల వెంచర్ యందు **ప్లాట్ నెం.77, విస్తీర్ణం : 252 గజాలు** కొనుటకై ఒప్పందం చేసుకొనియున్నారు. **వెంచర్ యొక్క సర్వే నెంబర్లు 194/పార్టు, 197/పార్టు, 198/పార్టు మరియు పర్మిషన్ నెం. 000246/LO/PLG/HMDA/2022 తేది. 13.12.2022 లెరా నెం. P02000005592.**

పై లే-అవుట్/వెంచర్‌కు సంబంధించిన ఎవరికైన ఎలాంటి హక్కులు, అభ్యంతరములు ఉన్నచో సరైన పత్రాలతో సహా 7 రోజులలో క్రింద తెలియపరిచిన న్యాయవాదిని వ్యక్తిగతంగా గాని లేదా న్యాయవాదితో గాని సంప్రదించగలరు. పైన తెలిపిన గడువు తరువాత ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించబడవు. నా క్లయింట్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొనగలరు.

ఇట్లు/- **గడీల ప్రభాకర్** B.A., L.L.B.,
న్యాయవాది
ఇ.నెం.3-2-90/2, ఎ.ఎం.ఆర్.నగర్,
భువనగిరి టౌన్, సెల్ : 9542895192

WANTED TRAINED TEACHERS

1) To teach **Kindergarten** with Montessori Training. (Female Candidates only)
2) Subjects : **English and Social Studies** for both Primary (SGT) and High School. (English Medium only. B.Ed must. (Female Candidates only).
3) **Computer Science** and **Librarian** (Female Candidates only).

Handwritten application with contact number, latest passport size photograph and true copies of testimonials should reach to the below given address on or before **15/04/2023.**
Date of Selection : 23/04/2023 (Sunday) Time : 8.30 A.M
Mode of Selection : Written Test, Interview and Demonstration will be on the same day.

The Correspondent
LITTLE FLOWER VIGNANA MANDIR HIGH SCHOOL, AND CBSE SCHOOL,
SANJEEVAIAH NAGAR, NALGONDA . PIN - 508001.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■ **Plot for Sale 250 Sq.yds,** Behind MRF Tyres, Hyd Road, Padma Nagar, Call: 8309667358 [WB-1155]

HOUSE FOR SALE
■ **Miryalaguda First Gated** Community. 92 Luxury Villas Club House, Swimmingpool, ready to occupy Just Rs. 1.11Cr. Call : 7013578378. [H-797565]

Services

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-08]

■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 9115551443. [T-03]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785707]

■ మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15000 నుంచి 20,000 వరకు జీతం.మరిన్ని వివరాలకై 9000408325 [G-785712]

■ HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం: వసతి కలదు. సంప్ర: 040-66366664, 9392663777, 9246663777 [HA-1330]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

యువతి వివాహానికి అడ్డొస్తాడనే..?

- నవీన్ హత్యకు ఇదే కారణమని జీ.అన్నారంలో చర్చ
- హత్యోదంతంలో పాత్ర, సూత్రధారులపై పోలీసుల ఆరా
- పరారీలోనే నిందితులు


నవీన్ (ఫైల్)

నిడమనూరు : యువతి వివాహానికి ఎక్కడ అడ్డుపడతాడోనన్న కారణంతోనే త్రిపురారం మండలం జీ.అన్నారం గ్రామానికి చెందిన విరిగి నవీన్ (21)ను దారుణంగా హత్య చేసినట్లు ఆ గ్రామంలో చర్చ జరుగుతోంది. అన్నారం గ్రామానికి చెందిన విరిగి లక్ష్మయ్య, శారద దంపతులకు ఓ కూతురుతో పాటు నవీన్ సంతానం. కూతురుకు వివాహం కాగా, చదువు మధ్యలో మానేసిన నవీన్ మిర్యాలగూడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. వీరిది వెనుకబడిన సామాజిక వర్గం కావడంతో పాటు పేద కుటుంబం. ఇదే గ్రామానికి చెందిన తాళ్ల నాగయ్య కుటుంబం మిర్యాలగూడలో కూరగాయల వ్యాపారం చేస్తోంది. నాగయ్య చిన్నకుమార్తె, నవీన్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు.

వ్యవహార శైలి నచ్చకనేనా..

ఏడాది క్రితం నవీన్, సదరు యువతి ప్రేమ విషయం పెద్దలకు తెలిసింది. అయితే, నవీన్ చదువు మధ్యలో మానేసి బైక్ మెకానిక్‌గా పనిచేస్తుండడం, కుటుంబ ఆర్థిక స్థితిగతులు, గతంలో అదే గ్రామానికి చెందిన సొంత సామాజిక వర్గానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నానంటూ పెద్ద మనుషుల్లో పంచాయితీ జరగడం తదితర కారణాలతో యువతి కుటుంబ సంభ్యులు, బంధువులు వీరి ప్రేమను తిరస్కరించారని గ్రామంలో చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఇటీవల యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుసుకున్న నవీన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం, ఎక్కడ వివాహానికి అడ్డుపడతాడోనన్న ఉద్దేశంతోనే హత్య జరిగినట్లుగా గ్రామస్తులు భావిస్తున్నారు.

హత్యకు ముందే ఘర్షణ

ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో కోలుకున్న నవీన్ స్నేహితులను కలిసేందుకు ఆదివారం గుంటిపల్లికి వచ్చాడు. విషయం తెలుసుకున్న యువతి బంధువులు ఇద్దరు ఆమెను మర్చిపోవాలని నవీన్, అతడి మిత్రుడు అనిల్‌కు నచ్చచెప్పే ప్రయత్నం చేశారని, వినకపోవడంతో ఘర్షణ పడి వెళ్లిపోయారని తెలిసింది. అనంతరం అక్కడే ఉన్న నవీన్ స్నేహితులతో కలిసి మద్యం తాగుతూ ఫోన్ చేయడంతోనే మూడు బైక్‌లపై వచ్చిన యువతి బంధువులు, మరికొందరు దారుణంగా హత్య చేసినట్లు తెలుస్తోంది.

పోలీసుల దర్యాప్తు ముమ్మరం

నవీన్ హత్య చేసి పారిపోయిన నిందితులను పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రత్యక్ష సాక్షులైన నవీన్ స్నేహితులను విచారించిన పోలీసులు హత్యోదంతంలో ఎవరెవరు పాల్గొన్నారని ఓ ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అయితే, దాడిలో పాల్గొన్నది ఎంత మంది? వారంతా యువతి తరఫు బంధువులేనా? కిరాయి వ్యక్తుల సహకారం తీసుకున్నారా? సూత్రధారులు ఎవరు? యువతి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందా? ఇలా మరింత లోతుగా పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

ముగిసిన అంత్యక్రియలు

ప్రేమించిన యువతి బంధువుల చేతిలో దారుణ హత్యకు గురైన నవీన్ మృతదేహానికి పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నవీన్ మృతదేహాన్ని స్వగ్రామమైన త్రిపురారం మండలం జీ.అన్నారం గ్రామానికి తీసుకువచ్చారు. సాయంత్రం అంతిమయాత్రలో పాల్గొని దహనసంస్కారాలు పూర్తి చేశారు. అయితే, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి


రెహాన్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతిచెందాడు. మిర్యాలగూడ పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో నివాసం ఉంటున్న ఎండి.సయ్యద్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారుడు ఎండి.సిరాజ్, రెండవ భార్య కుమారుడు ఎండి.రెహాన్(12) ఆదివారం మధ్యాహ్నం మిర్యాలగూడ శివారు ప్రాంతమైన చిల్లాపురం కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. సాయంత్రం ఎండి.సిరాజ్ ఒక్కడే ఇంటికి వచ్చి తమ్ముడు కనిపించడంలేదని కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు రాత్రి కలువ వెంట వెతికినా రెహాన్ ఆచూకీ లభించకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సోమవారం ఉదయం కాలువలో రెహాన్ విగత జీవుడిగా కనిపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెహాన్ మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎండి.సిరాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

విద్యుత్ తీగలు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధం


రామన్నపేట : మంటలు ఆర్పిస్తున్న ఎస్‌ఐ


చిలుకూరులో దగ్ధమవుతున్న గడ్డివాములు

రామన్నపేట : ప్రమాద వశాత్తు విద్యుత్‌తీగలు తగిలి డీసీఎంలోని గడ్డి దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం పల్లివాడ శివారులో జరిగింది. హైదరాబాద్‌కు చెందిన గేదెల పెంపకం దారుడు ఎన్నారం శివారులో గడ్డిని కొనుగోలు చేసి డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేశాడు. పొలంలో నుంచి డీసీఎం రోడ్డు ఎక్కుతున్న సమయంలో విద్యుత్‌తీగలు తగిలి మంటలు లేచాయి. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ లక్ష్మయ్య ఫైర్‌సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జేసీబీ సహాయంతో మంటలు అంటుకున్న గడ్డిని డీసీఎంలో నుంచి బయటకు తీయించి ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను ఆర్పారు. పక్కనున్న పొలాలు, పశువుల కొట్టాలకు మంటల వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. డీసీఎం పాక్షికంగా దెబ్బతిన్నది.

చిలుకూరులో..

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు ఆరు ఎకరాల గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికంగా నివాసం ఉంటున్న దొడ్డ రమేష్, కొడారు మధులకు చెందిన గడ్డివాములు గ్రామం వెంటనే ఉన్నాయి. మధ్యాహ్నం సమయంలో గడ్డివాములకు మంటలు అంటుకుని ఒక్కసారిగా వచ్చాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు ఆరు వేల గడ్డిమోపులు దగ్ధమవ్వగా రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వేర్వేరు చోట్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


గుర్రపోడు : పోలీసులు పట్టుకున్న వాహనం

చింతపల్లి : అనుమతులు లేకుండా చింతపల్లి, గుర్రంపోడు మండలాల పరిధిలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నీలా ప్రదీప్‌కుమార్ అక్రమంగా రేషన్ బియ్యాన్ని చింతపల్లి మండలం నుంచి తరలిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందడంతో తెల్లవారుజామున హోమంతాలపల్లి వద్ద నిఘా పెట్టగా రేషన్ బియ్యంతో వస్తున్న మహేంద్ర ట్రాలీ ఆటోను తనిఖీ చేయగా 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

పాల్వాయిలో 20క్వింటాళ్లు..

గుర్రంపోడు : నాంపల్లి మండలం పెద్దాపురం నుంచి చిర్ర యాదయ్య ఆటోలో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలం మీదుగా తరలిస్తున్నాడు. మండలంలోని పాల్వాయి శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు కిరణ్‌బాబు,మహేష్‌లు వాహనంను తనిఖీ చేసేందుకు ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ వాహనం వదిలి పారిపోయాడు. వాహనాన్ని తనిఖీ చేయగా బియ్యం బయటపడ్డాయి. వాహనాన్ని పోలీసుస్టేషన్‌ను తీసుకువచ్చి విచారణ జరిపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

పుట్టెడు దుఃఖంలో పరీక్షకు హాజరైన విద్యార్థిని


పరీక్ష సెంటర్‌కు వెళ్తున్న స్ఫూర్తి

మునుగోడు: ఇంట్లో తండ్రి మృతదేహం ఉన్నప్పటికీ పుట్టెడు దుఃఖంలో ఓ విద్యార్థిని సోమవారం ఎస్సెస్సీ పరీక్షకు హాజరైంది. మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన వీఆర్‌ఏ జిట్టబోయిన నరేందర్ (37) కుమార్తె స్ఫూర్తి నల్లగొండలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో పదో తరగతి చదువుతుంది. జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్‌లో ఎస్సెస్సీ పరీక్షలు రాస్తోంది. అయితే, స్ఫూర్తి తండ్రి నరేందర్ ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఇంట్లో తండ్రి మృతదేహం ఉండగా.. పరీక్షకు వెళ్లలేక శోకసంద్రంలో ఉన్న స్ఫూర్తిని బంధువులు ఓదార్చి పరీక్షకు వెళ్లేలా మనోధైర్యం కల్పించారు. దీంతో స్ఫూర్తి ఉదయం పరీక్షకు హాజరై.. తిరిగి వెళ్లి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.

అభివృద్ధిలో ఆలేరు అగ్రస్థానం : ప్రభుత్వ విప్


సమావేశంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత

బొమ్మలరామారం : అభివృద్ధిలో ఆలేరు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపానని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం బొమ్మలరామారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లోని పలు తండాలకు రోడ్ల పనుల నిమిత్తం నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. బొమ్మలరామారం మండలంలోని బోటిమీదితండా నుంచి తిమ్మాపూర్ వరకు రూ.2.01కోట్లు, నాగాయపల్లి నుంచి తిమ్మాపూర్ వరకు రూ.1.50కోట్లు, తుర్కపల్లి మండలం ఘుల్కలపల్లి నుంచి ధర్మారం దేవూజీ తండా వరకు రూ.4.50కోట్లు, పెద్దతండా నుంచి చోక్లాదండా వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.2.50కోట్లు, మేడిపల్లి నుంచి జంగారెడ్డితండా వరకు రూ.1.50లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అలాగే మల్కాపూర్ – వట్టిమర్రి తండాకు రూ.2.80 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాల్ నర్సింహ, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, కూర వెంకటేష్, కట్టా శ్రీకాంత్‌గౌడ్, బండి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు 19 కొత్త బస్సులు


కొత్త బస్సులను పరిశీలిస్తున్న ఎంవీఐ జిలాని

మిర్యాలగూడ టౌన్ : ఆధునిక సౌకర్యాలతో మిర్యాలగూడ డిపోకు ఇప్పటి వరకు 19 కొత్త బస్సులు వచ్చాయని డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. సోమవారం డిపోకు వచ్చిన రెండు సూపర్ లగ్జరీలు, డీలక్స్ బస్సులను ఎంవీఐ జిలాని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మిర్యాలగూడ డిపోకు ఇప్పటి వరకు నూతనంగా డిపోకు 14 సుపర్ లగ్జరీలు, 5 డీలక్స్‌లు వచ్చాయని తెలిపారు. ఆ బస్సుల్లో అన్నీ వసతులు ఉండటంతో దూరపు ప్రాంతాలకు సూపర్ లగ్జరీలను పంపించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేయాలన్నారు. వారి వెంట పలువురు డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వరి సాగు పరిశీలన

మోటకొండూర్: మండలంలోని మాటూర్, వర్టూర్, అమ్మనబోలు గ్రామాల్లో వరి సాగును మండల వ్యవసాయ అధికారి సుజాత, శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో మెడ విరుపు తెగులును గుర్తించి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్, రాజా, మధుశేఖర్, రైతులు లక్ష్మయ్య, రామచంద్రారెడ్డి, తిరుపతి, వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.


మాటూర్ గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి సుజాత, శాస్త్రవేత్తలు

కోదాడ పట్టణ సీఐ బదిలీ

కోదాడరూరల్: కోదాడ సీఐగా పనిచేస్తున్న శివశంకర్ సూర్యాపేట డీఎస్పీకి బదిలీ అయ్యారు. మునగాల సీఐగా పనిచేస్తున్న ఆంజనేయులు కోదాడ పట్టణ సీఐగా రానున్నారు. నూతన సీఐ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా శివశంకర్ 7నెలలు మాత్రమే సీఐగా కోదాడలో పనిచేశారు.

సాగర్‌లో ఆగిన మంత్రి రోజా


మంత్రిరోజాకు శాలువా కప్పి స్వాగతం పలుకుతున్న హోటల్ యజమాని

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లో ఆంధ్రప్రదేశ్ టూరిజం, సాంస్కృతిక, యువజనశాఖ మంత్రి రోజా సెల్వమణి సోమవారం సాయంత్రం ఆగారు. హైదరాబాద్ నుంచి మాచర్ల వైపు వెళ్తూ నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథిగృహంలో కాసేపు సేదదీరారు. ఈ సందర్భంగా విజయ విహార్ హోటల్ యజమాని మిట్టపల్లి శ్రీనివాస్ దంపతులు మంత్రికి శాలువా కప్పి స్వాగతం పలికారు. వచ్చే ఏడాది ఇరు రాష్ట్రాల పర్యాటక శాఖ ఎండీలు, అటవీశాఖ అధికారులతో మాట్లాడి శ్రీశైలానికి లాంచీలు నడిచేలా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

హైదరాబాద్‌లో థీమ్ పార్కు కార్యాలయం సందర్శించిన బౌద్ధభిక్షువు


బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు కార్యాలయంలో కంబోడియా బౌద్ధభిక్షువు హర్షవర్ధన్

నాగార్జునసాగర్: సంబుద్ధ గ్లోబల్ ఫౌండేషన్ క్రైటియా పగోడా(కంబోడియా) బౌద్ధ విహారానికి చెందిన బౌద్ధ భిక్షువు హర్షవర్ధన్ హైదరాబాద్‌లోని బౌద్ధ వారసత్వ థీమ్ పార్కు ప్రధాన కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఆయనకు బుద్ధవనం ప్రత్యేకతను స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య వివరించారు. ఆయనకు బుద్ధిష్ట్ ఎక్స్‌పర్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తాను రాసిన బుద్ధిస్ట్ ఆర్కియాలజీ ఇన్ తెలంగాణ పుస్తకాన్ని బహూకరించారు. బౌద్ధభిక్షువు హర్షవర్ధన్ మంగళవారం బుద్ధవనాన్ని సందర్శించేందుకు నాగార్జునసాగర్‌కు వస్తున్నట్లుగా మల్లెపల్లి లక్ష్మయ్య తెలిపారు. కార్యక్రమంలో కె.కె.రాజా, రాష్ట్రపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయుడు


గాయపడిన బాలుడితో తల్లిదండ్రులు

మోత్కూరు: ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులను చితకబాదడంతో ఒకరి చేయి పగులు పట్టింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల ఎస్సీ బాలుర పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసింది. కొత్త బస్టాండ్ వద్ద గల ఎస్‌వీ కళాశాలలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో ఈ నెల 5వ తేదీన విద్యార్థులు గొడవ చేస్తున్నారని చందుతో పాటు మరో నలుగురిని సైన్స్ ఉపాధ్యాయుడు అంజిరెడ్డి చితకబాదాడు. దీంతో చందు ఎడమ చేయి దగ్గర దెబ్బ గట్టిగా తాకడంతో అక్కడ కీలు వద్ద పగులుడు పట్టింది. ఈ నెల 8వ తేదీన అతని తల్లిదండ్రులు జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన మామిడి వెంకన్న, నిరోజలకు సమాచారం తెలిసి వచ్చి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటస్వామిని అడిగారు. జరిగింది పొరపాటే అని ప్రిన్సిపాల్ చెప్పారు. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఉండే నర్సు ఎక్స్‌రే తీయించి వైద్యం చేయించి బాధిత విద్యార్థి చందుకు కట్టు కట్టించారు.బాధ్యుడైన ఉపాధ్యాయుడు అంజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పేరాల వెంకన్న, ప్రతినిధులు మద్దెల మహేష్, మల్లయ్య, కూరెళ్ల రామనర్సయ్య, సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు ఎర్ర యాదగిరి డిమాండ్ చేశారు. కేసు ఉపసంహరించుకున్నట్లు బాధిత విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు.

ఉపాధి కూలీలకు 200రోజులు పనిదినాలు కల్పించాలి

భువనగిరిటౌన్: ఉపాధిహామీ కూలీలకు 200రోజులు పనిదినాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ కూలీల హక్కుల సాధనకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సలిగంజి వీరస్వామి, అశోక్, చెక్క వెంకటేశం, ఇమ్రాన్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ నాయకులు

పశువుల పెంటతో భూసారం పెంపు

- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు
- పెద్దవూర ఏఓ సందీప్


పాడి పంట

పెద్దవూర: ప్రస్తుతం రైతులు అధిక శాతం రసాయన ఎరువుల ద్వారానే పంటలను సాగు చేస్తున్నారు. దీంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదక శక్తి తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ సూచిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో..

పశువులు, మేకలు, గొర్రెల పెంట పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇది సేంద్రియ ఎరువుతో సమానం. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతోంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పెంట మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల పెంట ఉపయోగపడుతుంది. ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల పెంటను వినియోగించాలి.


పశువుల పెంటను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు


పెంటను వ్యవసాయ పొలంలో కుప్పలుగా పోస్తున్న రైతులు

భూసారం పదిలం

సాధారణంగా రైతులు వేసవిలో పశుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో వెదజల్లితే వాటిలోని పోషకాలు ఆవిరి అవుతాయి. పశువుల పెంటను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తగిన తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీనివలన భూసారం పెరుగుతుంది. భూమి గుల్లబారడానికి తోడ్పడుతుంది. సహజసిద్ధమైన లవణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి మొక్కలకు అందేవిధంగా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

ఇలా దుక్కి దున్నాలి

దుక్కిని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవికాలంలో మెట్ట భూములను వానాకాలం సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. దీంతో మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.